ప్రజాశక్తి
శనివారం 13 జనవరి 2024
5
శ్రీకాకుళం



విసికి ఆంధ్ర సారస్వతా పరిషత్ పురస్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకటరావుకు ఆంధ్ర సారస్వతా పరిషత్ పురస్కారం లభించింది. ఆంధ్ర సారస్వతా పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి లఖినాన రవికుమార్ పురస్కార జ్ఞాపికను అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మన భాష సంస్కృతి, వికాసం అవసరాన్ని తెలియజేసే ఉద్దేశంతో ఇటీవల ఆంధ్ర సారస్వతా పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్తంగా రాజమండ్రిలో నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు మహాసభల నిర్వహణ అద్భుతమని కొనియాడారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- శ్రీకాకుళంలో కానరాని రద్దీ నియంత్రణ చర్యలు
- జి.టి రోడ్డులో గజిబిజిగా సెంటర్ పార్కింగ్

జిల్లా కేంద్రంలో జిటి రోడ్డుకు ఒక ప్రత్యేకత ఉంది. ఆ రోడ్డులోనే ప్రముఖ వస్త్ర, నగల దుకాణాలు, ఇతర షాపింగ్ మాల్స్ అన్నీ కేంద్రీకృతమై ఉన్నాయి. సాధారణ రోజుల్లోనే ఆ మార్గంలో విపరీతమైన రద్దీ ఉంటుంది. పండగల సందర్భాల్లో ప్రత్యేకించి భోగి, సంక్రాంతి వంటి రోజుల్లో రద్దీ ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. జనం ఒకరినొకరు తోసుకుంటూ వెళ్లాల్సిందే. ఏటికేడు ట్రాఫిక్ సమస్య జటిలమవుతున్నా ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించడం లేదు. జనం ట్రాఫిక్ ఇక్కట్లకు మున్సిపల్ అధికారుల పాపమూ లేకపోలేదు. సెల్లార్ల నిర్మాణం లేకుండానే భవన నిర్మాణాలకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్ విభాగం, మున్సిపల్ కార్పొరేషన్ రెండింటి వైఫల్యంతో జి.టి రోడ్డులో జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- క్రమబద్ధీకరణలో ట్రాఫిక్ పోలీసుల వైఫల్యం
- మున్సిపల్ అధికారుల నిర్వాకమూ కారణమే

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరంలో జి.టి రోడ్డు వ్యాపార, వర్తక కేంద్రంగా ఉంది. వస్త్ర, నగల దుకాణాలు, షాపింగ్ మాల్స్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, రడీమేడ్ బట్టల షాపులు ఎక్కువగా ఉన్నాయి. ఆర్‌కె, ఎస్ఆర్ వంటి పెద్ద వస్త్ర దుకాణాలు, రడీమేడ్ దుస్తుల షాపులు ఉండడంతో నగర ప్రజలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కొనుగోళ్ల కోసం ఇక్కడకు వస్తుంటారు. వీరితోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు, నగర ప్రజలు తమ వాహనాలతో దుకాణాలకు వస్తుండడంతో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీసులు కొన్నేళ్లుగా జి.టి రోడ్డు సెంటర్ ప్రాంతాన్ని వాహనాల పార్కింగ్ కోసం కేటాయించడంతో వాహనాలు తీసుకొస్తున్న వారంతా అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. పండగ సీజన్ కావడంతో జి.టి రోడ్డుపై ఈ ఏడాది విపరీతమైన రద్దీ పెరిగింది. కనీసం ద్విచక్ర వాహనం నిలపడానికీ అవకాశం లేకుండా పోయింది. దుకాణాలకు వస్తున్న వారు పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో, పార్కింగ్ వాహనాల ముందు తమ వాహనాలను ఆపుతున్నారు. దీంతో వాహనాలను తీసేందుకు వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. స్టేట్‌బ్యాంకు జంక్షన్, పెట్రోమాక్స్ వీధి, వీనస్ హోటల్ సమీపంలో రోడ్డు క్రాస్ చేసేందుకు పోలీసులు స్టాపర్లను ఏర్పాటు చేసినా ఆ ఖాళీ ప్రాంతంలో వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు క్రాస్ అవ్వడానికి ఎక్కడా అవకాశం లేకుండా పోయింది. వాహనాల మధ్య ఉన్న చిన్నపాటి గ్యాప్‌లోనే అతికష్టంగా దాటుతూ జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించరెందుకు?

పండగ సీజన్ దృష్ట్యా పోలీసులు కనీసం ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తే జనానికి ట్రాఫిక్ కష్టాలు కొంతవరకైనా తీరేవి. నగరంలో అత్యంత ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటున్న జి.టి రోడ్డులో పలుచోట్ల పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కలిగిస్తే పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కొంతమేర తీరుతాయి. గతంలో ఇదే విధానాన్ని పోలీసులు అమలు చేశారు. వీటితోపాటు న్యూకాలనీ, ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానాల్లో వంటి ఖాళీ ప్రదేశాల్లో కార్లు, ఆటోలకు పార్కింగ్‌కు అవకాశం కల్పిస్తే ట్రాఫిక్ వెతలు తీరుతాయి. జనం, వాహనాల రద్దీ లేని పెద్దబరాటం మార్గంలో వన్‌వే అమలు చేసి, ట్రాఫిక్ ఎక్కువ ఉన్న టౌన్ హాల్ రోడ్డులో రెండువైపులా ప్రవేశాలు ఎందుకు కల్పించారో ఎవరికీ అంతుచిక్కడం లేదు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు కనీసం పర్యవేక్షించిన పాపాన పోలేదు. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.



అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

ట్రాఫిక్ పోలీసుల వైఫల్యమే

జనం ట్రాఫిక్ అవస్థలకు పోలీసుల వైఫల్యమే ప్రధానంగా కనిపిస్తోంది. జిల్లా కేంద్రంలో సిఎం పర్యటన, ఆదిత్యుని జయంతి వంటి ముఖ్యమైన రోజుల్లో ట్రాఫిక్‌పై ప్రత్యేకించి సమావేశాలు నిర్వహించి క్రమబద్ధీకరించే పోలీసులకు జి.టి రోడ్డులో జనం ఇబ్బందులు కనిపించేలా లేవు. పండగ రద్దీ నేపథ్యంలో మున్సిపల్ అధికారులతో సమావేశమై క్రమబద్ధీకరణ అంశంపై దృష్టిసారించినట్లు లేదు. గురువారం ఉదయం వరకు కార్లు, ఆటోలు, ఇతర పెద్ద వాహనాలకు జి.టి రోడ్డులోకి అనుమతిచ్చిన పోలీసులు మధ్యాహ్నం 12 గంటల తర్వాత వాటిని ఆపారు. ఆటోలను పూర్తిస్థాయిలో ఆపినా సిఫార్సులు, పలుకుబడి ఉన్న వారి వాహనాలను మాత్రం వదిలేశారు. ప్రముఖ వస్త్ర దుకాణాలకు మాత్రం ఇబ్బంది లేకుండా స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద తొలి నుంచి రోడ్డు దాటేందుకు మార్గం ఉండగా, అక్కడకు అత్యంత సమీపంలో ఇటీవల నూతనంగా ప్రారంభించిన ఎస్ఆర్ షాపింగ్‌మాల్ వద్ద ప్రత్యేకంగా స్టాపర్లను ఏర్పాటు చేసి రాకపోకలకు అవకాశం కల్పించారు. అదేవిధంగా చిన్నబరాటం వీధి కూడలి వద్ద మొదట్నుంచీ మార్గం ఉండగా అక్కడకు సమీపంలోనే ఎస్ఆర్ షాపింగ్‌మాల్ వద్ద స్టాపర్లను ఏర్పాటు చేశారు.

మున్సిపల్ అధికారులూ కారణమే

శ్రీకాకుళం కార్పొరేషన్‌లో వాణిజ్య వ్యాపార ప్రయోజనాల కోసం నిర్మిస్తున్న బహుళ అంతస్తు భవనాలకు అధికారులు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నారు. పార్కింగ్ సౌకర్యం కల్పించకున్నా సెల్లార్ నిర్మించకున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. ప్రస్తుతం ఇదే నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం కావడానికి కారణమైంది. శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా మారడంలో కార్పొరేషన్ అధికారుల ఉదాసీనమే కనిపిస్తోంది. వాణిజ్య ప్రాంతాల్లో నిర్మిస్తున్న భవనాలకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. వాణిజ్య అవసరాల భవనాలను నిర్మిస్తే, కచ్చితంగా పార్కింగ్ కోసం కొంత స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుంది. పలురకాల వ్యాపారాలు, ఆస్పత్రులు, హోటళ్లు నిర్వహించే వారు టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం సెల్లార్లను నిర్మించాల్సి ఉంటుంది. శ్రీకాకుళం నగరంలో వాణిజ్య ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వాణిజ్య, వ్యాపార సముదాయాలకు రెండు, మూడు దుకాణాలకు మినహా మిగిలిన వాటికి సెల్లార్లే లేవు.

అక్రమ రవాణాపై అప్రమత్తం

- ఎస్‌పి జి.ఆర్ రాధిక
- పాతపట్నం చెక్‌పోస్టు పరిశీలన

ప్రజాశక్తి - పాతపట్నం, మెళియాపుట్టి, ఎచ్చెర్ల

గంజాయి, గుట్కా, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం, మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల నేపథ్యంలో డబ్బు అక్రమ రవాణా జరిగే అవకాశాలున్న నేపథ్యంలో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. 24 గంటలూ చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంట పాతపట్నం సిఐ నల్లి సాయి, ఎస్ఐలు మహమ్మద్ యాసిన్, రాజేష్ తదితరులున్నారు.

ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను ఎస్‌పి పరిశీలించారు. అనంతరం ఆర్మ్డ్ పోలీస్ సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగంలో ఆయుధాగారం, కార్యాలయంలోని రికార్డుల నిర్వహణను పరిశీలించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, మోటార్ ట్రాన్స్‌పోర్టు విభాగాల్లో తనిఖీలు నిర్వహించి పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు కె.ఎస్ రావు, సిహెచ్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 26న ఉదయం తొమ్మిది గంటలకు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదిక, స్టాల్స్, సీటింగ్, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి, సంక్షేమ శాఖలు తమ శాఖల ప్రగతిని తెలియజేసే శకటాల ప్రదర్శనలను సిద్ధం చేయాలని సూచించారు. పరేడ్‌కు పోలీసులు, ఎన్‌సిసి కేడెట్లు సమన్వయం చేసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు అందించే ప్రశంసాపత్రాలకు సంబంధించి జాబితాను ఈనెల 19వ తేదీలోగా ఫొటోలతో డిఆర్‌ఒకు అందజేయాలని ఆదేశించారు. ఉద్యోగుల పేర్లతో పాటు వారు ఏవిధంగా ప్రశంసా పత్రానికి అర్హులో తెలియజేస్తూ వివరణ విధిగా తెలియజేయాలన్నారు. ప్రశంసాపత్రం పొందిన వారికి సార్థకత ఉండాలని చెప్పారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ వేదిక ఏర్పాట్లలో ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా చూడాలని, సాంస్కృతిక కార్యక్రమాలకు ముందుగానే సిద్ధంగా ఉండాలని చెప్పారు. స్పీచ్ నోట్ తదితర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున సరిపడే మాస్క్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, పరేడ్‌ను వివరించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, ఉప కలెక్టర్ పద్మావతి, డిపిఒ రవికుమార్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు చిట్టిరాజు, విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

స్వస్థలం నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిరుద్యోగ యువత స్వస్థలాల నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఉపాధి కార్యాలయం ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ employment.ap.gov.inను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే కాకుండా దేశం మొత్తంలో ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి కల్పన సమాచారం ఈ వెబ్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తమ విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫొటో, ఇతర సర్టిఫికెట్లను ఈ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకొని, తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సంబంధిత అభ్యర్థి ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డును ఆన్‌లైన్‌లోనే పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిక్కెట్ల కేటాయింపులో సమన్యాయం

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

సామాజిక న్యాయమే జగన్ అజెండా అని మరోసారి నిరూపితమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలో టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు దువ్వాడ శ్రీనివాస్, పిరియా విజయ, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గానికి బిసిలకే టిక్కెట్లు కేటాయించి తన ఔదార్యాన్ని చాటుకున్నారని అన్నారు. మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలకూ ఇదేవిధంగా సామాజిక సమతూకాన్ని పాటించనున్నారని తెలిపారు. కలసికట్టుగా పనిచేసి అన్ని నియోజకవర్గాల్లోనూ విజయం సాధిస్తామన్నారు. టెక్కలి నియోజకవర్గంలో మరింత సమన్వయంతో కృషి చేసి విజయం సాధిస్తామని దువ్వాడ శ్రీనివాస్ తెలిపారు. టెక్కలి సీటుని వైసిపి విజయాల ఖాతాలో వేస్తామన్నారు. పిరియా విజయ మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచే వైసిపికి తొలి విజయాన్ని ఇచ్చేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. పేరాడ తిలక్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలతో ఎంపీ అభ్యర్థిగా విజయం సాధిస్తానన్నారు. సమావేశంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, ఎంపిపి ఆరంగి మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం

2024-25 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాసంస్థలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 20వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7,573 మంది ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

పరీక్ష కోసం జిల్లావ్యాప్తంగా 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. 20న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, నవోదయ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, హెచ్-సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

- 3,900 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం
- 125 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - మెళియాపుట్టి, మందస

సంక్రాంతి నేపథ్యంలో మందస, మెళియాపుట్టిలో నాటుసారా తయారీ స్థావరాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) అధికారులు శుక్రవారం దాడులు చేశారు. మందస, మెళియాపుట్టి ప్రాంతాల్లో ఎస్ఇబి అదనపు ఎస్‌పి వి.ఎన్ మణికంఠ పర్యవేక్షణలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 3,900 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. విక్రయాలకు సిద్ధంగా ఉంచిన 125 లీటర్ల నాటసారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. దాడుల్లో సోంపేట ఎస్ఇబి సిబ్బంది, ఎస్ఇబి పోలీసు, ఇంటెలిజెన్స్ బృందాలు పాల్గొన్నాయి.



ANDHRA PRADESH MEDICAL SERVICES AND INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION SRIKAKULAM DIVISION

Short Tender Notice No.15/DB/EE-SKLM/APMSIDC/2023-24/ Dt.12.01.2024

e-procurement Short Tender is invited for **30** works (22 works 8th call 4 works 6th call, 4 works 5th call in APMSIDC Division, Srikakulam.

Bid Document Download starts from 19.01.2024@ 3:00 PM on words to bid document download end date is 30.01.2024 up to 3:00 PM.

Last date and time for uploading of bid documents are 30.01.2024 up to 4:00 PM

Technical Bid Opening date:30.01.2024 @5:00 P.M.

The details of Notice inviting Tender and Bid documents can be downloaded through **https://tender.apeprocurement.gov.in** Other details can be obtained from the Office of the Executive Engineer, APMSIDC Division, RIMS Govt. Hospital Campus, Srikakulam (Phone No.8978680791, 8978680779)

Sd/- Executive Engineer, APMSIDC Division, Srikakulam.

అంగన్వాడీల కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 'జగనన్నకు చెబుదాం... కోటి సంతకాల విన్నపం' కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. శ్రీకాకుళం నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి సంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లు న్యాయసమ్మతమైనవని, ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా అంగన్వాడీలు అనేకరకాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా స్పందించకపోవడం శోచనీయమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. ఎస్మా జిఒ కాపీలను భోగి మంటల్లో దగ్ధం చేస్తామని, ఆమరణ నిరాహారదీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.ప్రకాష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, కె.వి హేమలత తదితరులు పాల్గొన్నారు.

పలాస, సోంపేటలో కోటి సంతకాల సేకరణను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, సోంపేట మాజీ సర్పంచ్ చిత్రాడ నాగరత్నం, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో కోటి సంతకాల సేకరణను యుటిఎఫ్ నాయకులు జి.మాధవరావు ప్రారంభించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు విజయ్ కుమార్, కొండలరావు, వ్య.కా.స జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాఆద్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జలజాక్షి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.సుధ తదితరులు పాల్గొన్నారు. రణస్థలంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద తలపై కొంగులు వేసుకొని అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో బస్టాండ్ కూడలి వద్ద సమ్మె శిబిరంలో చేతులెత్తి మొక్కుతూ, పొర్లు దండాలు పెడుతూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. పొందూరులో సమ్మె శిబిరాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. పోరాటానికి మద్దతుగా రూ.ఏడు వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పొందూరు అప్పారావు, ఎం.రమణారావు, జి.రామారావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు. నరసన్నపేటలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు బగ్గు రమణమూర్తి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని పోరాడుతున్న అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శిమ్మ చంద్రశేఖర్, వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి జామి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : కోటి సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న వి.జి.కె మూర్తి



రణస్థలం : తలపై కొంగులు వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



ఇచ్ఛాపురం : పొర్లు దండాలు పెడుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, శ్రీకాకుళం వారి కోర్టులో
O.S. No. 47/2022

Between: **పాగోటి అప్పాజి** --వాది
And:
కోరాడ గణేశ్వరరావు@గణేష్ --ప్రతివాది

To, **కోరాడ గణేశ్వరరావు@గణేష్,** S/o లేటు వెంకట భాగయ్య,R/o కలివరపుపేట స్ట్రీట్, నరసన్నపేట టౌను, పోస్టు మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా.

నోటీసు

పై నెంబరు గల దావాలో వాది తనకు రావలసిన దావా సొమ్ము మీ వద్ద నుండి రాబట్టే నిమిత్తం, పైన పేర్కొనబడిన కోర్టులో దావా దాఖలు చేయగా, పై నెంబరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం **తే 30-01-2024 దీన వాయిదా యున్నది.** కావున మీరు వాయిదా రోజున స్వయంగా గాని, వకీలు ద్వారా గాని, వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥** లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకోవలయును, లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడం అయినది.

// మహా రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం //

నరసన్నపేట
తేది:12-01-2024

రెడ్డి జగన్నాధరావు
వాది తరపున న్యాయవాది,
ఫోన్: 9866310819

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, శ్రీకాకుళం వారి కోర్టులో
IA. 298/2022 in OS. 47/2022

Between: **పాగోటి అప్పాజి** --ప్రిటిషనర్/వాది
And: **కోరాడ గణేశ్వరరావు@గణేష్**
--రెస్పాండెంట్/ప్రతివాది

To, **కోరాడ గణేశ్వరరావు@గణేష్,** S/o లేటు వెంకట భాగయ్య,R/o కలివరపుపేట స్ట్రీట్, నరసన్నపేట టౌను, పోస్టు మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా.

నోటీసు

పైనెంబరు గల దావాలో, వాది తనకు రావలసిన దావా సొమ్ము రాబట్టే నిమిత్తం పైన పేర్కొన బడిన కోర్టులో దావా మరియు మీ ఆస్తిని జప్తు చేయమని కోరుచూ దాఖలు చేయగా, మీకు నోటీసు నిమిత్తం **తే 30-01-2024దిన వాయిదా యున్నది.** కావున మీరు వాయిదా రోజున, స్వయంగా గాని, వకీలు ద్వారా గాని వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30ని॥లంకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలేను. లేని ఎడలు మీ పరోక్షమందు Exparte తీర్మానం జరుగునని యిందు మూలముగా తెలియ జేసుకోవలయును.

// మహా రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం //

నరసన్నపేట
తేది:12-01-2024

రెడ్డి జగన్నాధరావు
వాది తరపున న్యాయవాది,
ఫోన్: 9866310819

వివేకానందుని జీవితం అనుసరణీయం


శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు


కవిటి : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లోళ్ల రాజేష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వామి వివేకానందుని జీవితం నేటి తరానికి అనుసరణీయమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాల్లో ఎలుగెత్తి చాటారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, వివేకానంద ట్రస్టు వ్యవస్థాపకులు జామి భీమశంకరరావు తదితరులు పాల్గొన్నారు. సూర్యమహల్ కూడలి వద్ద గల వివేకానంద విగ్రహానికి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుని జీవితం మనందరికీ ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, ఎన్‌వైకె కోఆర్డినేటర్ ఉజ్వల్, తహశీల్దార్ ఎన్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు తదితరులు హాజరై నివాళులు అర్పించారు.

నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీ మందిర ప్రతినిధులు సురంగి మోహనరావు, నిక్కు అప్పన్న, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్‌లు ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పైడి హరనాథరావు, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, హారికా ప్రసాద్, బాడాన దేవభూషణ్, నక్క శంకరరావు పాల్గొన్నారు.

స్వామి వివేకానందుని జయంతి వేడుకలు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు డిప్యూటీ గవర్నర్ శాసపు జోగి నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు డాక్టర్ డి.వి. విద్యాసాగర్ పాల్గొని నిరుపేదలకు, గిరిజనులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు నూతన గవర్నర్ జామి నారాయణ, మాజీ గవర్నర్ జి. ఇందిరా ప్రసాద్, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.వి. రవిశంకర్, మాజీ గవర్నర్లు పి.జి. గుప్తా, గుడ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

సోంపేట: మండలంలో మామిడిపల్లి గ్రామంలో వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు పలువురు టిడిపి, జనసేన నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

కవిటి: వివేకానందుడు నేటి తరానికి ఆదర్శమని జనసేన నాయకుడు లోళ్ళ రాజేష్, ఎంఠ్ ధనుంజయ మజ్జి అన్నారు. వివేకానంద జయంతి వేడుకలు కల్యాణి ఆంగ్ల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మాధవి, డైరెక్టర్ బల్లెడ రమేష్ పాల్గొన్నారు. అదే విధంగా బెజ్జిపుట్టుగలో సర్పంచ్ నారాయణ స్వామి, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు పొందల కృష్ణారావు, గ్రామస్తులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు, ఉషోదయ యువజన సంఘం భవనం వద్ద బెందాలం చిట్టిబాబు, పాండవ శేఖర్, ఆరింగి మధు, బొరివంక, దుగానపుట్టుగలో సర్పంచ్‌లు శ్రీరాం ప్రసాద్, భద్రాచలం వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పలాస: పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి అంబటి ఆనందరావు, వజ్రపుకొత్తూరు వైస్ ఎంపిపి తమ్మినాన శాంతరావు, వైసిపి నాయకులు బాలయ్య, కె.కేశవరావు, అచ్చు వైకుంతరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్‌ఐసి ఉద్యోగి టేకి ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానంద విగ్రహానికి గ్రామ సర్పంచ్ అల్లు కన్నబాబు పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాన్న రాంబాబు, హెచ్‌ఎం హరికృష్ణ, గ్రంథాలయాధికారి చంద్ర శేఖర్, రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావేరు: శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పాపారావు ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎఎంసి చైర్మన్ రిక్క బాబ్జి, పలువురు ఉపాధ్యాయులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

నరసన్నపేట: సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి. సమరసతా వేదిక అధ్యక్షులు సదాశివుని కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరావుతో పాటు పలువురు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎస్ ప్రతినిధులు భమిడిపాటి గౌరీశంకర్ కెఎల్ఎన్.మూర్తి, ప్రసాద్, ఉప్పాడ వెంకటరమణ. శ్రీధర్ మాస్టర్, దత్తు మాస్టర్ పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి, యువజన దినోత్సవం కార్యక్రమంలో హార్టికల్చర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ బివికె భగవాన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చలపతి, డైరెక్టర్ సన్యాసిరావు రైతులు, యువత పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక తొలుసూరుపల్లి జంక్షన్ వద్ద వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య కళా సమితి వ్యవస్థాపకులు చిలుకు కృష్ణారావు, కళా సమితి నిర్వాహకులు దూసి ఆంధ్రా స్టాలిన్, మూల తాతయ్య, మల్లారెడ్డి పద్మనాభం, బమ్మిడి కృష్ణారావు, బొడ్డ అయ్యబాబు, చిట్టెన్న పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ నివాళ్లర్పించారు. ఈ మేరకు స్థానిక తోలుసురుపల్లి జంక్షన్ వద్దనున్న స్వామి వివేకనంద విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నందిగాం: మండలం లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి హిమంత్‌సాయి సిద్దార్ధ వివేకానంద వేషదారణ పలువురుని ఆలరించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక రామారావు, రంకిడి రామారావు, బెందాళం రత్నం, త్రినాధరావు, పాల్గొన్నారు.


సోంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


పొందూరు : నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పొందూరు: మండలం తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఉపాధ్యాయులు హరిప్రసన్న, విద్యార్థులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ సమావేశమందిరంలో వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైసిపి నాయకులు పేడాడ వెంకటరావు, అన్నెపు రామారావు, సింగుపురం వినోద్, గొద్దు చిరంజీవి ఉన్నారు. అలాగే మండలంలో ఊడికలపాడు శ్రీరామమందిరంలో సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, గ్రామ పెద్దలతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సనపల కరుణ్‌కుమార్, శివప్రసాద్, సత్యాన్నారాయణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: పెద్ద పద్మపురంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, సర్పంచ్ మాలతి జయలక్ష్మి, ఎంపిటిసి ప్రతినిధి ఉర్లన ఋషి రామరాజు, ట్రస్ట్ చైర్మన్ పి.రామరాజు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి- నందిగాం

గిరిజన సంక్షేమానికి సిఎం జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైసిపి శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. శుక్రవారం మండలం రధజన బొడ్డపాడు పంచాయతీలో 500 గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ బొడ్డపాటి తిరుపతిరావు అధ్యక్షతన బెల్లుకోలలో జరిగిన కార్యక్రమంలో నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, సీనియర్ నాయకులు కింతల ధర్మారావు, మాదిన గోపాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు తమిరె ఫాల్గుణ, జయరాం, ప్రత్యేక అహ్వానితులు చిన్ని జోగారావు, ఎంపిటిసిలు బాలకృష్ణ, విష్ణు, రామచంద్రుడు, సర్పంచ్‌లు తమిరె రాజు, దేవేంద్ర, కణితి నారాయణమూర్తి, బొమ్మాళి గున్నయ్య, బోంగి మోహనరావు పాల్గొన్నారు.


వివేకానంద చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న చంద్రమోహన్

యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి- బూర్జ

రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే యువత మేల్కొని స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా జనసేన అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం కొల్లివలస జంక్షన్‌లో యువసేన - జనసేన కార్యక్రమాన్ని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కొత్తకోట నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని, చివరికి తినటానికి తిండి కూడా కరువై ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది రైతులు సంక్రాంతి పండుగ కూడా చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆయన వాపోయారు. అలాగే యువతకు ఎటువంటి ఉపాధి లేక ఉద్యోగాలు కల్పించక యువతను నిర్వీర్యం చేస్తుందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సిక్కోలు ఎంపిటిసి విక్రం, నియోజకవర్గ నాయకులు పేడాడ రామ్మోహన్, కోరుకొండ మల్లేశ్వరరావు, పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గర్భాన సత్తిబాబు, భూపతి అర్జున్, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవోదయ నమూనా పరీక్ష

ప్రజాశక్తి- మందస

మండలం హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నందు జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని యుటిఎఫ్ ఆధ్వర్యంలో నవోదయ నమూనా పరీక్ష 5వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. మార్పుట్రస్ట్ చైర్మన్ మట్ట ఖగేశ్వరరావు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ పరీక్షకు మందస, పలాస, వజ్రపు కొత్తూరు మండలాల నుంచి 211 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా కె.సుజన్ ప్రథమ స్థానం, ఎస్.వినీల్ ద్వితీయ స్థానం, జయదేవ్ తృతీయ స్థానం పొందగా ప్రోత్సాహక బహుమతులను సిహెచ్ లిఖిత, ఎస్ హాసిని, రేవంత్ కుమార్, ఆరోహి పట్నాయక్, ఎన్ మనోజ్, బి.తపస్విని, డి.కీర్తనలకు సర్పంచ్ జె.పురుషోత్తం, విశ్రాంత హెచ్‌ఎం వై.సోమేశ్వరరావు, జి.శ్యామ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చక్రధరరావు, యుటిఎఫ్ నాయకులు గున్న రమేష్, గుంట కోదండరావు, కంచరాన రమేష్, దాసరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సోంపేట: పోటీ పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో భయంపోయి పోటీతత్వం పెరుగుతుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబురావు అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన దీక్ష, రాహుల్, కౌశిక్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఒ జోరాడు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎస్.కూర్మారావు, మండల ప్రధాన కార్యదర్శి గొరకల దొరబాబు, జి.ప్రకాష్ రావు, సుశీల, కాళిదాసు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్యం

కవిటి: గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మారుమూల గ్రామాల్లో ఉన్న పిహెచ్‌సిలను అభివృద్ధి చేస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య సేవలు పొందాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ హెడ్ - హెల్త్, న్యూట్రిషన్ సత్తి శ్రీనివాస్, అదనపు డిఎంహెచ్ఒ అనురాధ అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఆధ్వర్యంలో అత్యాధునిక సదుపాయాలతో, కార్పొరేట్ ఆస్పత్రి స్థాయిలో రూపుదిద్దిన బొరివంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు డియంహెచ్ఒ డాక్టర్ అనురాధతో కలిసి శుక్రవారం పున:ప్రారంభించారు. అనంతరం అదనపు డియంహెచ్ఒ అనురాధ మాట్లాడుతూ బొరివంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక ల్యాబ్ పరికరాలతో ఉచితంగా రక్త పరీక్షలు, డెలివరీలు నిర్వహించేందుకు అన్ని సదుపాయలు సమకూర్చినట్టు తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ హెడ్ - హెల్త్ మరియు న్యూట్రిషన్ సత్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఇదే స్థాయిలో అభివృద్ధి చేయడం జరిగిందని, మరో 4 ఆస్పత్రులను త్వరలో పున్నప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రణవ్ కుమార్ చౌదరి, సురేష్, మెడికల్ ఆఫీసర్ తేజ, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ విజేత పాలకొండ

ఆమదాలవలస: పట్టణంలోని రావికంటిపేటలో రెండు రోజులుగా వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో విజేతగా పాలకొండ జట్టు నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు చింతాడ రవికుమార్ చేతులమీదుగా రూ.50 వేలు నగదు, ట్రోఫీని, రన్నర్‌గా నిలిచిన జిఎంపల్లి టీమ్‌కు రూ.40 వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులంతా పాల్గొన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సుందరరావు మాష్టారు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ రమణ,రిఫరీ బోర్డు చైర్మన్ తిరుపతిరావు, కబడ్డీ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు సమక్షంలో ఇన్విటేషన్ కమ్ నాకౌట్ మ్యాచ్‌లుగా నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఒలింపిక్ అసోసియేషన్ వారికి, కబడ్డీ అసోషియేషన్ వారికి, క్రీడాకారులకు, వైసీపీ నాయకులకు కార్యకర్తలకు చింతాడ రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

వరిగడ్డితో ట్రాక్టర్ దగ్ధం

రణస్థలం: వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో వరిగడ్డితో పాటు, ట్రాక్టర్ దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో రూ.30 వేలు మేరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. మండలంలో ఎర్రవరం గ్రామ సమీపంలో శుక్రవారం కాకినాడకు చెందిన ట్రాక్టర్‌లో నీలంపేట గ్రామానికి చెందిన యాగాటి గోవిందకు చెందిన వరిగడ్డిని శ్రీకాకుళం నుంచి నీలంపేట తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఎర్రవరం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రాంతానికి వచ్చేసరికి ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి విద్యుత్ తీగలను తాకింది. దీంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయి నిప్పురవ్వలు రాలడంతో ఎండిఉన్న వరిగడ్డికి నిప్పంటుకుంది. క్షణాల్లో మంటలు ఎగసిపడి అగ్నిప్రమాదంలో గడ్డివాము దగ్ధమైంది. ట్రాక్టర్ పాక్షికంగా పాడైంది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే రణస్థలం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఇంటింటికీ కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

మండలం పాతర్లపల్లి పంచాయతీ సూరంపేట, పాతర్లపల్లి, వెంకటేశ్వర కాలనీలో కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిధులతో సూరంపేట గ్రామంలో రూ. 29 లక్షల వ్యయంతో 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.25 లక్షల వ్యయంతో ఇంటింటికి కొళాయిలను, పాతర్లపల్లి గ్రామంలో కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రూ.57లక్షల వ్యయంతో లక్ష 20వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంక్‌ను, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ. 48 లక్షల వ్యయంతో ఇంటింటికి కొళాయిలను, వెంకటేశ్వర కాలనీలో కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీలో రూ.32లక్షల వ్యయంతో 60వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.29లక్షలు వ్యయంతో ఇంటింటికి కొళాయిలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేతులు మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నీటిని పొదుపుగా వాడడంతో పాటు కొళాయిలను జాగ్రత్తగా వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు పాల్గొన్నారు.


కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో గుత్తావల్లి గ్రామీణ వికాస్ బ్యాంకుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లాభం గ్రామంలో ప్రమాద బీమా సొమ్ము అందజేత కార్యక్రమం చేపట్టారు. ఇటీవల లాభం గ్రామంలో ఎపిజివి బ్యాంకు ఖాతాదారు నక్క పద్మ పిడుగుపాటుకు గురై మరణించడంతో ప్రమాద బీమా సొమ్ము రూ.20 లక్షల చెక్కును బ్యాంకు రీజినల్ మేనేజర్ బి.రాఘవేంద్ర నామిని నక్క రవికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పప్పల కృష్ణారావు, గుత్తావల్లి బ్రాంచి మేనేజర్ వీరబాబు, నోడల్ ఆఫీసర్ వాసు, ఎస్‌బిఐ జనరల్ టీమ్ సురేష్ వినీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆరో సచివాలయం పూజారి వీధికి చెందిన కలివరపు ప్రవీణ్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్‌ఆర్ బీమా పథకం ద్వారా రూ.లక్ష చెక్కును మున్సిపల్ విప్ దుర్గా శంకర్ పండా మృతుడు కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ పట్నాల వైకుంఠరావు, ఎమినిటీస్ సెక్రటరీ మనీషా పండా పాల్గొన్నారు.



బూర్జ : చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయాల పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో హంస కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న శివాలయాన్ని శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, హిరమండలం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి గోగుల వరప్రసాద్ నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా శివాలయ నిర్మాణానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి నిధులు పూర్తిస్థాయిలో మంజూరు చేయిస్తానని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు పొగిరి రవి, హంస కాలనీ గ్రామస్థులు పొగిరి గోపాలరావు, వెంకటరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలో శేఖరాపురం, బాణాపురం, జాడుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ జె.సత్యనారాయణ సందర్శించారు. టిటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న దేవాలయ నిర్మాణ పరిస్థితిని ఆయన పరిశీలించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారి పుష్ప, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, గణేష్ ప్రధాన్, నాగరాజు, తారక్ పాల్గొన్నారు.


కొత్తూరు : స్థానిక నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్

రసవత్తరంగా టెన్నికాయిట్ జాతీయ పోటీలు

పలాస: పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 47వ జాతీయ టెన్నికాయిట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. 24 రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. పురుషుల విభాగం టీమ్ ఛాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానం కేరళ, 2వ స్థానం కర్ణాటక, 3వ స్థానం తమిళనాడు, 4వ స్థానం పాండిచ్చేరి నిలవగా మహిళా విభాగంలో మొదటి స్థానం తమిళనాడు, 2వ స్థానం పాండిచ్చేరి, 3వ స్థానం కేరళ, 4వ స్థానం మహారాష్ట్ర జట్లు నిలిచాయి.

క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జట్లు

పురుషుల విభాగంలో వ్యక్తిగతంగా ఆడిన పోటీల్లో కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిస్సా, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమబెంగాళ్, ఆంధ్రప్రదేశ్ జట్లు నిలవగా డబుల్స్ మిక్స్ పోటీల్లో తమిళనాడు, కర్ణాటక, ఒడిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, కేరళ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. ఈ పోటీల్లో టెన్నికాయిట్ అసోసియేషన్ కోశాధికారి పి.తవిటయ్య, జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షులు వై.డి. రామారావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఎన్.వి. .సత్యన్నారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఎం.సాంబమూర్తి, రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ముఖ్య సలహాదారులు పి.సుందరరావులు పర్యవేక్షించగా స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, హరిబాబు, డి. రామారావు, పద్మలోచనలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడలను ఆడించారు.


టెన్నికాయిట్ పోటీలు ఆడుతున్న యువకులు

వైసిపికి షాక్

కవిటి: ఇచ్ఛాపురం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పిరియా విజయను ప్రకటించిన మొదటిరోజే నియోజకవర్గంలో వైసిపికి భారీ షాక్ తగిలింది. మొదటి నుంచి కాంగ్రెస్, తరువాత వైసిపికి మంచిపట్టున్న మాలగోవిందపురం పంచాయతీ నుంచి పదుల సంఖ్యలో వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరిని నిలువరించేందుకు నేతలు చివరివరకు చేసిన బుజ్జగింపులు ఫలించలేదు. కొద్దిరోజుల్లోనే సుమారు ఐదు వేలమందితో సోంపేటలో సమావేశం ఏర్పాటు చేసి ఎంపి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్ సమక్షంలో భారీసంఖ్యలో టిడిపిలో చేరికలు జరపనున్నట్లు వీరు తెలిపారు. సోంపేట మండలం మాల గోవిందపురం పంచాయతీ బాతుపురం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ కార్యకర్త ఉత్తరాల బ్రహ్మానందం ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో వైసిపి కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే అశోక్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ మాలగోవిందపురం పంచాయతీ నుంచి సీనియర్ కార్యకర్తలు టిడిపిలోకి చేరడం శుభ పరిణామమన్నారు. ఎంపి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్ సమక్షంలో పూర్తిస్థాయిలో టిడిపిలో చేరికల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం మాలగోవిందపురం, బాతుపురం, కొత్త బాతుపురం, శ్రీరాం నగర్ కాలనీ, చిన్న కోస్టా, పెద్ద కోస్టాకు చెందిన ఉత్తరాల కృష్ణారావు, ఉత్తరాల అలెక్, మహిమారావు, ప్రసాద్, ప్రతాప్ సాగర్ రౌలోతో పాటు పలువురును ఎమ్మెల్యే అశోక్ టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సొండికుల జిల్లా అధ్యక్షుడు సాహుకారి దివాకర్, ఆర్.వాసుదేవరావు, ఆర్.వెంకటరమణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్.చంద్రమోహన్, ఇప్పిలి అప్పలస్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.


బ్రహ్మానందంను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యువతకు పరుగు అవసరం

ప్రజాశక్తి- పలాస

యువతి, యువకుల ఆరోగ్యానికి పరుగు ఎంతో అవసరమని కాశీబుగ్గ ప్రముఖ వైద్యులు తెప్పల ఆనంద్ అన్నారు. మండలం బొడ్డపాడు గ్రామంలో ఉద్దానప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువివి) ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి 5కె రన్ వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడు కూడలి నుంచి పలాస మండలం బొడ్డపాడు మీదగా నీలావతి యువివి గ్రంథాలయం వరకు నిర్వహించారు. 5కె రన్‌ను తెప్పల ఆనంద్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, ఉద్దాన ప్రాంత సర్పంచ్‌ల సంఘం సైని దేశయ్య, బొడ్డపాడు సర్పంచ్ తామడ మధన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతి, యువకులు ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ గిరిజా ఈశ్వరరావు, మల్లా నాగరాజు, ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ రెయ్యి తాతారావు, మల్లేన అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, పాల్గొన్నారు.


5కె రన్ ప్రారంభిస్తున్న ఆనంద్

విజేతలు వీరే...

5కె రన్ పురుషుల విభాగంలో ప్రథమస్థానంలో అందాల శ్యామ్ సుందర్ (లోహరిబంద), రెండో స్థానంలో రాంబుడ్డి మహేష్ (కొర్లాం), మూడో స్థానంలో చల్లా రాజు (శ్రీకాకుళం), కన్సోలేషన్ బహుమతికి సచ్చి సంతోష్ కుమార్ (రాయపాడు), వెంపటాపు భాస్కరరావు(పలాస) విజేతలుగా నిలిచారు. మహిళా విభాగంలో ప్రథమస్థానంలో ఉగ్రపల్లి అర్చన(పలాస), ద్వితీయ స్థానంలో పాడి దీక్ష(పలాస) నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలతో పాటు షీల్డ్ అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల సంస్థ కేలండరు ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ వార్షిక క్యాలండరు, డైరీని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కంచరాన శ్రీరాములు, రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎస్ రాజు, జెఎసి సెక్రటరీ జనరల్ ఎస్.వి రమణ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపాన గోవిందరావు, జిల్లా అధ్యక్షులు రఘునాథ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

యుటిఎఫ్ ఔదార్యం

టెక్కలి: మండల యుటిఎఫ్ శాఖ తన ఔదార్యాన్ని చాటుకుంది. సర్వశిక్షా అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో సంఘ నిధులు నుంచి రూ.6వేలు ఎంఆర్‌సి సిబ్బందికి శుక్రవారం ఆందించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహ అధ్యక్షులు కురమాన దాలయ్య, మండల కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, గౌరవాధ్యక్షులు మారం కుమారస్వామి, నిర్వాహకులు రోణంకి విజయ్‌కుమార్, పాలవలస ధర్మారావు, దవళ లక్ష్మీనారాయణ, ఎంఆర్‌సి సిబ్బంది రవి, సంతోష్, రాంబాబు పాల్గొన్నారు.

పొందూరు: ఎంఆర్‌సిలో పనిచేస్తున్న ఎస్ఎస్ఎ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శుక్రవారం రూ.36,500ల ఆర్థిక విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఎంఇఒలు పివి.రామరాజు, పట్నాన రాజారావుల చేతులమీదుగా ఎస్ఎస్ఎ ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు అప్పారావు, మొగదాల రమణరావు, గండెం రామారావు, విజయ్‌కుమార్, అప్పలనాయుడు, గోపాలరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉపాధ్యాయులు ఆర్థికసాయాన్ని అందించారు. మండల, మున్సిపాలిటీలో అన్ని విభాగాల సంఘ నాయకులు, ఉపాధ్యాయులు కలిసి మండల విద్యాశాఖ అధికారులు జి. రాజేంద్రప్రసాద్, టింగరాజుల చేతుల మీదుగా రూ.లక్షా 30 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి : సాయాన్ని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న సాయికుమార్

అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామ సచివాలయ సిబ్బందికి 2024- 2025 సంవత్సరాలకు సంబంధించి ప్రజా ప్రణాళికలు తయారుచేసేందుకు నిర్వహించే మండలస్థాయి శిక్షణా శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి రణస్థలం ఎంపిపి ప్రతినిధి, వైఎస్ఆర్ పార్టీ నాయకులు పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి మంచి సంకల్పంతో పంచాయితీరాజ్ సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా సమర్థవంతంగా పని చేయుటకు గ్రామస్థాయిలో బలమైన వ్యవస్తగా ప్రతీ రెండు వేల మంది జనాభాకు ఒక గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డి దేనని అయన అన్నారు. కార్యక్రమంలో మండల ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, మండల ఎఒ ధనుంజయరావు, మండల విద్యాశాఖాధికారి త్రినాథరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

అరసవల్లిని సందర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని జిఎస్‌టి జాయింట్ కమిషనర్ సుమతి, ట్రైనీ ఐఎఎస్ పవన్ దత్తా వేర్వేరుగా సందర్శించారు. వారిని ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలను కప్పి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులతో పాటు ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

భవిష్యత్ గ్యారెంటీని నిర్వహించాలి

ప్రజాశక్తి- పలాస

టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష టిడిపి నాయకులకు సూచించారు. మందస మండలం హరిపురం పార్టీ కార్యాలయంలో టిడిపి ముఖ్య నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంపై చంద్రబాబు నాయుడు దృష్టి పెట్టనున్నారని, ఈ కార్యక్రమంపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. క్లస్టర్, యూనిట్ పరిధిలో నాయకులు బాధ్యతగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గం సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వీల్ చైర్ అందజేస్తున్న సత్యసాయి సమితి సభ్యులు

వీల్ చైర్ అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

వికలాంగ రైల్వే ప్రయాణికుల కోసం వీల్‌చైర్‌ను సత్యసాయి సేవాసమితి మెట్టక్కివలస ఆధ్వర్యంలో కొండవలస గ్రామానికి చెందిన కొండవలస వెంకటరమణమూర్తి, హిరమండలం వృద్ధాశ్రమం ఇన్‌ఛార్జి కె.ప్రహ్లాదరావులు రైల్వేస్టేషన్ మేనేజర్ మొదలవలస రవికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే వికలాంగ ప్రయాణికుల సౌకర్యార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మెడికల్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి. తాతయ్యలు, జిల్లా గ్రామ సేవలు ఇన్‌ఛార్జి మునగ వలస రవీంద్రబాబు, ఆకెళ్ళ శేషగిరి శాస్త్రి, మెట్ట నారాయణరావు ఉన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

సంక్రాంతి రోజుల్లో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని జెఆర్.పురం సిఐ జి.రామచంద్రరావు హెచ్చరించారు. అలాగే కోడిపందాలు, పేకాట నిర్వహకులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందాలు, కోడి కత్తులు తయారీదారులు పేకాట, నిర్వహకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ జి.రాజేష్, లావేరు ఎస్ఐ కోటేశ్వరరావు, ఎచ్చెర్ల ఎస్ఐ సత్యనారాయణ, జి.సిగడాం ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని జెడ్‌పిటిసి గూడ ఎండయ్య అన్నారు. శుక్రవారం పెద్దమడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉల్లాసానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తెబురు ప్రసాదరావు, ఉప సర్పంచ్ రమేష్, వార్డు మెంబర్లు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

శ్రీ వివేకానంద విద్యానిలయం 24వ వార్షికోత్సవ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ లోళ్ల సూర్యనారాయణ మాస్టారు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జె.చిన్నవాడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చు కావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జోనల్‌స్థాయి క్విజ్‌పోటీల్లో విజేతలకు ఎంఇఒలు జె.చిన్నవాడు, డి.అర్జునుడు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సూరాజ్ దాసురాజు, పరపటి శ్రీనివాస్, అరంగి అప్పన్న, రెడ్డిసూరిబాబు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న తిలక్, దువ్వాడ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కొత్తమ్మతల్లి ఆలయాన్ని వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ శ్రీనివాస్‌లు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



శ్రీకాకుళం అర్బన్ : వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి- కవిటి

మండలం కొత్తూరులోని బడగల శంకరరావు కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కరస్పాండెంట్ పిరియా కళ్యాణ్ బోగి మంటలు ముట్టించి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు రంగవల్లికలు, వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది జె.పాపారావు, జె.సుబ్బారావు, వి.జయప్రకాష్, ముకుందరావు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కోలాటం, ముగ్గుల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు పాల్గొన్నారు. కోలాటం, ఫుడ్ ఫెస్టివల్, ముగ్గుల పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపల్ ఎం.ప్రసాదరావు, ఎడి జి.వి జగన్నాథం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించాయి. కళాశాలలో అన్ని బ్రాంచీల్లో రంగవల్లులు, గొబ్బెమ్మలు, తోరణాలతో విద్యార్థులు అలంకరించారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు పాటలతో ఐతమ్ కళాశాలలో పండగ వాతావరణం చోటు చేసుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, సాంఘిక నృత్య గీతాలాపనలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు వి.సుధాప్రియ, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, టంకాల నాగశేషు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, డీన్లు, అసోసియేట్ డీన్లు, హెచ్ఒడిలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా ఖజానా శాఖలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాలులో భాగంగా భోగి మంటలు ఏర్పాటు చేశారు. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను



టెక్కలి రూరల్ : ఐతమ్ కళాశాలలో భోగి మంట వేసిన విద్యార్థులు

జిల్లా ఖజానా ఉప సంచాలకులు సిహెచ్. రవి కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఎటిఒలు ఎ. తవిటన్న, పి.గోగరాజు, ఎస్‌టిఒలు ఎం.తులసిరావు, ఎం.భాగ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ బి. శ్రీనివాసరావు, ఎం.సాయి, కె.వరప్రసాద్, ఎం.డేవిడ్, పి.సింహాద్రి రాజు పాల్గొన్నారు.

నగరంలో రామలక్ష్మణ జంక్షన్, బ్యాంకర్స్ కాలనీలో సాయి ప్రియదర్శిని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న విశాఖ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషదారణల్లో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. ముగ్గులపోటీలు నిర్వహించారు. విద్యార్థుల గోదాదేవి, హరిదాసు, గ్రామీణ ప్రజల వేషధారణలు, జానపద నృత్యాలు, భోగి మంటలు అందర్ని ఆకట్టుకున్నాయి. వేడుకల్లో చైర్మన్ కె.మధుసూదన్, ప్రిన్సిపాల్ రామారావు పాల్గొన్నారు.



నౌపడ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వసంతరెడ్డి

భావనపాడులో జగనన్న సురక్ష

ప్రజాశక్తి-నౌపడ

సంతబొమ్మాళి మండలం భావనపాడులో సర్పంచ్ బి.మోహన్ రెడ్డి, జెడ్‌పిటిసి పాల వసంత్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రాజ్యలక్ష్మి, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పరిమళ, కార్యదర్శి రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అందిస్తున్న వైద్య సేవలను ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని ఎంపిడిఒ సిహెచ్ ఈశ్వరమ్మ అన్నారు. శుక్రవారం కొత్తపేట సర్పంచ్ అంబటి శ్రీనుతో కలిసి వైద్య సేవలను ఆమె పరిశీలించారు. శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వజ్రపుకొత్తూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వైద్యాధికారి ప్రియాంక, స్పెషలిస్ట్ వైద్యులు కీర్తి, శ్రీనాథ్, అఖిల రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కోమరల్తడ సర్పంచ్ చింత రాజు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

శిరీష పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మండలం పెదంచల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి గ్రామపార్టీ అధ్యక్షుడు గుమ్మిడి నారాయణ తల్లి అప్పలమ్మ, ఉగ్రిపల్లి సూర్యారావు భార్య హేమలతలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాక్షించారు. ఆమెతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, పోలాకి పాపారావు, ధనుంజయ, నరసింహ ఉన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధి సచివాలయంలో ఆసక్తి గల వారు సిల్క్ డెవలప్మెంట్‌లో వివిధ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఈనెల 17లోగా అందించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. స్కిల్ డెవలప్ మెంట్ ట్రెనింగ్ కోర్సులు, నేషనల్ అకాడమీ ఫర్ కన్స్ట్రక్షన్ డిపార్ట్మెంట్, గ్రామ, వార్డు సచివాలయం ఆధ్వర్యంలో టైలరింగ్, ఎలక్ట్రిక్ పనులు, బ్యూటీషన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణ ఇవ్వబడునన్నారు. అసక్తి ఉన్నవారు మండల న్యాయ సంస్థ, జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నందు 17లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు వార్డు సచివాలయాల్లో, పురపాలక సంఘ కార్యాలయంలో స్వీకరించబడునని కమిషనర్ తెలిపారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రానున్న ఎన్నికల్లో బిజెపి నుంచి పోటీకి సిద్ధం కావాలని జిల్లా ఇన్‌ఛార్జి వివి రామరాజు, కమిటీ సభ్యులు బుద్ధ లక్ష్మి నారాయణ అన్నారు. శుక్రవారం ఎన్నికల కార్యాచరణ సమావేశం బిజెపి ఎచ్చెర్ల క్యాంప్ కార్యాలయం, ఎన్ఇఆర్ క్యాంపస్‌లో జిల్లా పార్టీ అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అధ్యక్షతన ఏర్పాటు చేసిన మూడు నియోజకవర్గాలు ఎచ్చెర్ల, రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల ఎన్నికల కార్యాచరణ సమావేశం ఏర్పాటు చేసారు. ముందుగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



మాట్లాడుతున్న ఎన్ఇఆర్

అనంతరం జరిగిన కోర్ కమిటీ సమావేశంలో కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సుహాసిని ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇజ్జాడ శ్రీనివాసరావు, బొబ్బిలి శ్రీను, ఎన్.రజిని పాల్గొన్నారు.

బిసిలకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం బిసిలకు తీవ్ర అన్యాయం చేసిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందసలో టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం జయహో బిసి సభ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బిసిలకు న్యాయం చేశామని చెప్పుకుంటున్న జగన్ మోహన్ రెడ్డి అన్నీ ప్రాంతాల్లో రెడ్డిలకు పెద్దపీట వేస్తూ బిసి మంత్రులు, బిసి నాయకులతో పల్లకి మోయిస్తున్నారన్నారు. బిసికి చెందిన 30 పథకాలకుపైగా రద్దుచేసిందన్నారు. కార్యక్రమంలో



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

టిడిపి నాయకులు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పోర్టు వాహనాల రద్దీని నియంత్రించాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మూలపేట పోర్టు వాహనాలతో ప్రమాదాలు సంభవిస్తున్నా, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా.. వాహనాల రద్దీ నియంత్రణకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని స్థానిక పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. వాహనాల రాకపోకలతో ప్రజలు, రోడ్డు పక్కన చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాహనాలు పరిమితికి మించి రాళ్ల రవాణా చేయడంతో రోడ్లు పాడై గుంతలు ఏర్పడుతున్నాయని చెప్పారు. నిర్దిష్ట సమయంలో మాత్రమే భారీ వాహనాలు నడపాల్సి ఉన్నా నిబంధనలు పాటించడం లేదన్నారు. పోర్టు వాహనాలు నడిపే రోడ్లకు ఇరువైపులా విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లు వెడల్పు చేయాలని, పాడైన రోడ్లను వెంటనే బాగుచేయాలని డిమాండ్ చేశారు. పోర్టు వాహనాల వల్ల వాటిల్లే నష్టాలపై ఫిర్యాదు చేసిన వారిపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలన్నారు. సంక్రాంతి సందర్భంగా నాలుగు రోజుల పాటు పోర్టు వాహనాల రాకపోకలను నిషేధించాలని డిమాండ్ చేశారు. పోర్టు వాహనాల ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం పాటు నష్టపరిహారం అందించాలన్నారు. టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు మట్ట పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో టిడిపి నాయకులు పినకాన అజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు కోత మధుసూదనరావు, సిపిఎం, సిపిఐ నాయకులు నంబూరు షణ్ముఖరావు, అనపాన షణ్ముఖరావు, బిజెపి నాయకులు ఉదయ్ భాస్కరరావు, జనసేన నాయకులు కణితి కిరణ్ కుమార్, కెఎన్‌పిఎస్ నాయకులు బి.ప్రభాకరరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు కె.కామేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రెయ్య పున్నయ్య తదితరులు పాల్గొన్నారు

వైఎస్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కోటబొమ్మాళి: రైతు సంక్షేమం కోరే నాయకుడు దివంగతనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, వ్యవసాయ కమిటీ చైర్మన్ సగ్గు పుణ్యావతి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు బజారు అవరణలో దివంగతనేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల బాగుకోరే నాయకుడు రాజశేఖర్‌రెడ్డి విగ్రహం రైతు బజారు వద్ద ఏర్పాటు చేయటం తమకు ఎంతో అనందంగా



భూమిపూజ చేస్తున్న ఎంపిపి, ఎఎంసి చైర్మన్

ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దుక్క రోజారామకృష్ణ, వైసిపి నాయకుడు సగ్గు రామిరెడ్డి, స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావు, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస జనసేన కార్యాలయంలో శుక్రవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 22, 25 వార్డుల నుంచి యువత జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన నియోజక వర్గం నాయకులు డాక్టర్ వి.దుర్గారావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన సురేష్, చిరు, ఆదర్శ, మని, శ్రీహరి, దిలీప్, ప్రసాద్, దేవి రుషి , నవీన్, శ్రీకాంత్, సూరజ్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోన కృష్ణారావు, నాయకులు నందిగాం ధర్మారావు, వంశీ చౌదరి, దిలీప్ కుమార్ పాత్రో, జనసైనికులు పాల్గొన్నారు.



జనసేన పార్టీలో చేరిన యువకులు

వైసిపి విజయం తథ్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వైసిపి శ్రీకాకుళం ఎంపీ, టెక్కలి ఎమ్మెల్యే స్థానాలు విజయం సాధిస్తుందని ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం టెక్కలిలో కిల్లి పాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు రిగ్గింగ్‌లతో గెలుపొందారన్నారు. ఈసారి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించే టెక్కలి నియోజకవర్గంలో 40 వేల ఓట్ల మెజార్టీతో ఎంపీ అభ్యర్థి, 70 వేల ఓట్ల మెజార్టీతోను విజయం సాధిస్తామని దీమా వ్యక్తం చేశారు. రామ్మోహన్ నాయుడు ఎంపీగా 10 సంవత్సరాలు పరిపాలన చేసి జిల్లాలో శాశ్వతమైన పథకం ఒకటైనా చేశారా అన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక వెలుగు అసోసియేషన్ అధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై యువతీ, యువకులకు శిక్షణ నిర్వహించారు. కొత్తూరు, భామిని, సీతంపేట, హిరమండలం, పాతపట్నం మండలాలకు 13 గ్రామాల నుంచి 38 మంది సభ్యులు పాల్గొన్నారు రసాయనిక, పురుగు మందులు వల్లన నష్టాలు, ప్రకృతి వ్యవసాయం, భూమి సారం పెంచి పంటలు ఉత్పత్తి పెంచే విధానం, పంటలకు వచ్చు పురుగులు, తెగుళ్ల నివారణ కోసం రిసోర్స్ పర్సన్ దాసునాయుడు, నాగేశ్వరావు వివరించారు.



గృహహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న డిఎల్‌పిఒ సర్పంచ్

గృహ హక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

గోవిందపురం పంచాయతీ పరిధిలో జొన్నలపాడు గ్రామంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం పరిధిలో ప్రతిఇంటికి గృహ హక్కుపత్రం పుస్తకాలను డిఎల్‌పిఒ ఐవి.రమణ, సర్పంచ్ రెయ్య రామిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ హక్కు పత్రాలు గృహ హక్కుదారుడు తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా బ్యాంక్‌లో రుణాలు, ఇంటిపై హక్కు పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉమాసుందరి, ఇఒపిఆర్‌డి గోపాలరావు, ఎంపిటిసి మెండ ఉమ, వార్డ్ సభ్యులు లచ్చన్న, కార్యదర్శి ఢిల్లేశ్వరరావు, త్రినాథరావు, ముకుందరావు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

రూ.20 వేల ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాన్ని యువతరం సేవాసమితి సభ్యులు ఆర్థికసాయం అందించారు. పల్లిసారది గ్రామానికి చెందిన రెయ్య దుర్యోధన పెరాలసిస్ వ్యాధితో, అతని భార్య పుష్పలత రొమ్ము క్యాన్సర్‌తో నాలుగేళ్లుగా బాధపడుతున్నారు. ఇద్దరు ప్రస్తుతం మంచాన పడ్డారు. వారి ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉండడంతో మందులు కొనుక్కొనే స్థోమత లేక చాలా అవస్థలు పడుతున్నారు. కుటుంబ పరిస్థితి తెలుసుకున్న యువతరం సేవాసమితి రూ.20 వేలు ఆర్థికసాయాన్ని చెక్‌రూపంలో శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు చింత మురళీ, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గొరకల సునీల్, వెంకటరమణ, పాల్గొన్నారు.

పూజారిపేటలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు

ఆమదాలవలస: పట్టణంలోని 17వ వార్డు పూజారిపేటలో యూత్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 13 వరకు బాక్స్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు చిగురుపల్లి వెంకటేష్, పైడి వసంతరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు రూ.300 కమిటీ సభ్యులకు చెల్లించాలని తెలిపారు. క్రికెట్ కిట్లను పోటీలలో పాల్గొనే జట్లుతెచ్చుకోవాలని ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వబడునని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విన్నర్ జట్టుకు రూ.10 వేలు నగదు, షీల్డ్, రన్నర్ జట్టుకు రూ.5వేలు నగదు, షీల్డ్‌ను ప్రధానం చేయబడునని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే జట్లు కమిటీ వారిని సంప్రదించాలని కోరారు. మొదటిరోజు శుక్రవారం 6 జట్లు పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు బొడ్డేపల్లి కోటేశ్వరరావు,పేడాడ సతీష్, బగాది మణి, అరవింద్, సువ్వారి వినోద్ తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు

బూర్జ: మా బాధలు వినండి అంటూ చీడివలస గ్రామానికి చెందిన యాదవ కులస్తులు టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొల్లివలస జంక్షన్‌లో టిడిపి కార్యాలయంలో సమస్యలను రవికుమార్‌కు విన్నవించారు. 2019 ఎన్నికల ముందు వైసిపి నాయకులు మా యాదవ కులానికి చెందిన 50 కుటుంబాలకు పట్టాలిచ్చి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. నేటికీ దాదాపు ఐదు ఏళ్లుపూర్తయినప్పటికీ ఒక్క ఇళ్లస్థలం మంజూరు చేయలేదని ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. స్పందించిన రవికుమార్ మీ సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణ నాయుడు, టిడిపి ఉపాధ్యక్షుడు కన్నం నాయుడు ఉన్నారు.